క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కనిగిరిరూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక క్లబ్ రోడ్డు, అన్న క్యాంటీన్ ఏరియాల్లో సోమవారం చైర్మన్ అబ్దుల్ గఫార్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ మొక్కలు నాటడం అందరి బాధ్యతగా తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్ మాణిక్యరావు, కోఆప్షన్ సభ్యుడు గూడూరి అబ్రహం లింకన్, శానిటరీ ఇన్స్పెక్టర్ నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని గాయాలు


ప్రమాదానికి గురైన వారినితీసుకు వెళుతున్న అంబులెన్స్ సిబ్బంది

ఉలవపాడు: ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన జాతీయరహదారిపై ఉలవపాడు ఉత్తరబైపాస్ వద్ద సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..ఉలవపాడు మండలం రాజుపాలెంకు చెందిన శివబాలకోటయ్య, అలగాయపాలెంకు చెందిన వాసులు ఇద్దరూ ద్విచక్రవాహనం పై ఉలవపాడు వస్తున్న సమయంలో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని హైవే అంబులెన్స్ సిబ్బంది ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు.

నిబంధనలకు అతిక్రమిస్తే లైసెన్సు రద్దు


దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏడీఏ గోపాల్

గుడ్లూరు: వ్యవసాయ శాఖ నిబంధలను అతిక్రమించి వ్యాపారం చేస్తే లైసెన్సు రద్దు చేస్తామని వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఏడీఏ గోపాల్ దుకాణదారులను హెచ్చరించారు. మండల కేంద్రమైన గుడ్లూరులో విత్తనాలు, పురుగుమందుల దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా డిస్‌ప్లే బోర్డు, స్టాకు రిజిష్టర్‌లు, బిల్ బుక్స్ అప్‌డేట్ గా ఉండాలన్నారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణంలో అధిక ధరలు, నాసిరకం విత్తనాలు, కాలం చెల్లిన మందులు అమ్మినట్లు తన దృష్టికి వస్తే కేసు నమోదు చేసి లైసెన్సు రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ రవికుమార్, గుంటూరు ఏఓ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల తనిఖీ


పెన్షన్ల వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామాంజనేయులు

కొండపి: మండలంలోని కొండపి-1, ఇలవర సచివాలయాల్లో రూ.15 వేల పెన్షన్ తీసుకుంటున్న పింఛన్‌దారులను సోమవారం ప్రత్యేక బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఆరోగ్య వివరాలు పరిశీలించారు. డాక్టర్ల వైద్య బృందం ప్రత్యేకంగా పరీక్షలు చేసి యాప్‌లో వివరాలు నమోదు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిజమైన లబ్ధిదారుల వివరాలు తెలుసుకునేందుకు పింఛన్ల తనిఖీ చేస్తున్నట్లు బృంద సభ్యులు తెలిపారు. మండలంలో 56 పెన్షన్లు తనిఖీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీఓ రామాంజనేయులు, డాక్టర్లు, డిజిటల్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

కేంద్రాలు సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు


రికార్డులు తనిఖీ చేస్తున్న సీడీపీఓ

హనుమంతునిపాడు: అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించని కార్యకర్తలపై శాఖా పరమైన చర్యలు తప్పవని ఐసీడీఎస్ సీడీపీఓ సరోజిని అన్నారు. మండలంలోని వేములపాడు, లింగంగుంట్ల, పెద్దగొల్లపల్లి, కుడుములకుంట, రంగంపేట, రక్షణాపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం, కోడిగుడ్లు, పరిశీలించారు. విద్యార్థుల హాజరు, విధి నిర్వహణ రికార్డులు, రిపోర్టులు, బాలింతలు, గర్భిణుల హాజరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమయపాలన పాటించని కార్యకర్తలపై చర్యలుంటాయన్నారు. ఉదయం 9:00 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాలను నిర్వహించాలన్నారు. సెంటర్లు సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.


అద్దెభవనంలో కొనసాగుతున్న గిరిజన ఆశ్రమ పాఠశాల


గదులు లేక పరదాలు కట్టుకొని తరగతులు


తరగతి గదులు లేక చెట్ల కింద పాఠాలు

ఆశ్రమ పాఠశాలలో.. సమస్యల తిష్ట..!

ఆశ్రమంలోనే పేద గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన గిరిజన ఆశ్రమ పాఠశాలలు కనీస వసతులకు నోచుకోక కునారిల్లుతున్నాయి. ఏళ్ల తరబడి అద్దెభవనాల్లోనే కొనసాగించడంతో అందులో చదివే విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతూ చాలీచాలని గదుల్లోనే మగ్గుతున్నారు. తనిఖీల పేరుతో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాఠశాలకు వచ్చి పోతున్నారే తప్పా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో పేద గిరిజన విద్యార్థులు కష్టాలతోనే చదువుతూ కాలం వెళ్లదీస్తున్నారు.

- 24 ఏళ్లుగా అద్దెభవనంలోనే తరగతులు
- చాలీచాలని గదుల్లో విద్యార్థుల అవస్థలు
- 73 మంది బాలికలకు రెండు మరుగుదొడ్లే గతి
- అసంపూర్తిగా ఆశ్రమ పాఠశాల నూతన భవనం నిర్మాణం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

పొన్నలూరు: పొన్నలూరులో 2000 సంవత్సరంలో గిరిజన ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేశారు. పాఠశాల మంజూరైంది మొదలు నేటి వరకు 24 ఏళ్లగా అద్దె భవనంలోనే కొనసాగిస్తున్నారు. మొదటిలో ఈ పాఠశాల్లో 1వ తరగతి నుండి 7 వరకు ఉన్నా, ఆ తరువాత గత ప్రభుత్వం 2022 విద్యా సంవత్సరంలో 10వ తరగతి వరకు చదువుకునే అవకాశాన్ని గిరిజన విద్యార్థులకు కల్పించింది. మొదటిలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నా ఆ తరువాత ఉపాధ్యాయుల కృషితో ప్రస్తుతం 150 మంది ఉన్నారు. ఈ విద్యా సంవత్సరంలో పాఠశాల్లో 77 మంది బాలురు, 73 మంది బాలికలు ఉన్నారు. సొంత భవనంతో పాటు వసతులు సక్రమంగా లేకపోవడంతో మరో 60 మంది విద్యార్థులు పాఠశాల్లో చేరకుండా వెళ్లిపోయారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య బాగానే ఉన్నా ఆశ్రమ పాఠశాల్లో కొన్నేళ్లుగా సమస్యలు తిష్టవేశాయి.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత...

ఇదిఇలా ఉంటే గతంలో గిరిజన ఆశ్రమ పాఠశాల్లో ఒక్కడే ఉపాధ్యాయుడు ఉండే వాడు. దీని వలన విద్యార్థుల చదువులు కుంటుపడ్డాయి. ఏడాది పాటు ఉపాధ్యాయుల కొరత ఉన్నది. దీంతో గత ప్రభుత్వంలో హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటి ఉపాధ్యాయులను నియమించి ఉపాధ్యాయుల కొరతను తీర్చారు. అలాగే పాఠశాల్లో మొదటిలో 7వ తరగతి వరకు చదువుకునే అవకాశం ఉన్నా ఆ తరువాత 2022లో 10వ తరగతి వరకు చదువుకునే అవకాశాన్ని విద్యార్థులకు కల్పించారు. ఉపాధ్యాయుల కొరత తీరడంతో 2022-23, 2023-24 విద్యా సంవత్సరంలో పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు.


అసంపూర్తి నిర్మాణంతో నిరుపయోగంగా ఆశ్రమ పాఠశాల కొత్త భవనం

నిరుపయోగంగా కొత్త భవనం..

గిరిజన ఆశ్రమ పాఠశాలకు పక్కభవనం నిర్మించడానికి శ్రీశైలం గిరిజన సమగ్ర అభివృద్ధిశాఖ సంస్థ నుంచి రూ.5.40 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ క్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కనే నిర్మించడానికి 1.10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి అందులో రూ. 3.50 కోట్లతో భవనం నిర్మాణ పనులు చేపట్టి 80 శాతం వరకు నిర్మాణ పనులు పూర్తిచేశారు. అయితే మిగిలిన ఫ్లోరింగ్, గ్రిల్స్, తలుపులు, కిటికీలు, ప్రహరీ, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు నిర్మాణం పనులను చేయకుండా కాంట్రాక్టర్ వెళ్లిపోయాడు. ఈ క్రమంలో ఆ మధ్య కాలంలో అప్పటి కలెక్టర్ దినేష్‌కుమార్ ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి చలించిపోయారు. ఆ వెంటనే గిరిజన సమగ్ర అభివృద్ధిశాఖ సంస్థకు నిధులు మంజూరు చేసి భవనం నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో ఆ శాఖ వారు మిగిలిన పనులను పూర్తి చేయడానికి రూ.2.50 కోట్లతో అంచనాలు తయారు చేసి నిధులు మంజూరు కోసం విజయవాడ ఈఎన్‌సీ కార్యాలయానికి పంపించారు. అయితే వారు నిధులు మంజూరు చేయకపోవడంతో భవనం అసంపూర్తి పనులు కార్య రూపం దాల్చలేదు. ముఖ్యంగా నిధుల మంజూరుకు సంబంధించిన ఫైల్‌ను కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గత సెప్టెంబర్‌లో సాంఘీక సంక్షేమశాఖ మంత్రి బాలవీరాంజనేయస్వామికి అందించారు. అయితే మంత్రి స్వామికి ఫైల్ ఇచ్చి మూడు నెలలు కావస్తున్నా ఇప్పటికీ నిధులు మంజూరైన దాఖలాలు లేవు. మొత్తంగా అధికారుల పనితీరు, పాలకుల నిర్లక్ష్యం వలన గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు కనీస వసతులకు నోచుకోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తిష్టవేసిన సమస్యలు...

వాస్తవంగా ఈ అద్దెభవనంలో కేవలం రెండు మరుగుదొడ్లు ఉండటంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. 73 మంది బాలికలు ఉండటంతో ఉన్న మరుగుదొడ్లు సరిపోక కొంత మంది మలవిసర్జనకు ఆరుబయటకు వెళ్తున్నారు. అలాగే చిన్న తరగతి బాలికలు కొందరూ గత్యంతరం లేక దుప్పట్లను అడ్డుపెట్టుకొని ఆరుబయటనే స్నానం చేస్తున్నారు. సరిపడిన మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు రాత్రి సమయంలో బహిర్భూమికి వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. వీటితో పాటు దుస్తులు ఉతుకోవడానికి సరైన వసతి లేకా ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా బాల బాలికలు వేరు వేరుగా నిద్రపోవడానికి గదులు లేక పాఠశాల పక్కనే ఉండే నివాస గృహాల్లో బాలికలు నిద్రిస్తున్నారు. ఈ ఏడాది విద్యార్థులకు అందాల్సిన ట్రంకు పెట్టెలు, శ్వటర్లు, చెప్పులు వంటి విద్యార్థులకు అందాల్సిన వస్తువులు ప్రభుత్వం నుంచి ఇంకా అందలేదు.

చాలీచాలని గదులతో అవస్థలు...

పాఠశాల ఏర్పాటు చేసింది మొదలు నేటికి అద్దెభవనంలోని నిర్వహిస్తున్నారు. ఈ అద్దెభవనంలో కూడా మొత్తం నాలుగు గదులు ఉండటంతో సరిపడిన గదులు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ గదుల్లోనే పాఠాలు వింటూ రాత్రి సమయంలో ఇక్కడే నిద్రపోతున్నారు. విద్యార్థులకు సంబంధించిన పెట్టెలు, వస్తువులను కూడా తరగతి గదుల్లోనే ఉంచుతున్నారు. ఈ అద్దె భవనం కూడా శిథిలావస్థకు చేరడంతో వర్షం పడినప్పుడు స్లాబు ఉరుస్తుండటం వలన విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. అయితే చేసేదేమిలేకా ఉరుస్తున్న గదుల్లోనే విద్యార్థులు నిద్రపోవడం గమనార్హం.


తరగతి గదిలోనే విద్యార్థుల పెట్టెలు, వస్తువులు

తరగతి గదుల్లోనే నిద్రపోతున్నాం:



సరిపడిన గదులు లేకా తరగతి గదుల్లోనే నిద్రపోతున్నాం. వర్షం పడినప్పుడు స్లాబు ఉరుస్తుంది. అలాగే గదులు లేకా చెట్లు కింద తరగతులు నిర్వహిస్తున్నారు. వసతులు లేక చాలా మంది విద్యార్థులు పాఠశాల నుంచి వెళ్లిపోయారు. మా సమస్యలపై అధికారులు స్పందించి కనీస వసతులు ఏర్పాటు చేయాలి.

బిరుదుల వరుణ్, తొమ్మిదవ తరగతి

సరిపడిన మరుగుదొడ్లు లేవు:



ఆశ్రమ పాఠశాల్లో ప్రస్తుతం 73 మంది బాలికలు ఉన్నారు. వీరికి రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. దీంతో సరిపడిన మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. బాలబాలికలకు వేరు వేరు గదులు అయినప్పటికీ రాత్రి సమయంలో నానా అవస్థలు పడుతున్నాము. స్నానపు గదులు లేక కొంత మంది బాలికలు ఆరుబయట స్నానం చేస్తున్నారు.

పామూరి కల్పన, ఏడవ తరగతి

సమష్టిగా ముందుకు సాగుదాం


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో సోమవారం పొన్నలూరు మండల స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. సురేష్ మాట్లాడుతూ పొన్నలూరు మండలంలో పార్టీ బలంగా ఉందని, కార్యకర్తలు సమష్టి కృషితో పనిచేస్తే మండలంలో పార్టీకి మెజారిటీ రావటం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీకి నూతనోత్తేజం తీసుకుని వచ్చే విధంగా నూతన కమిటీలు ఉంటాయన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి పేద ప్రజలను గాలికి వదిలేసిందని దుయ్యబట్టారు. పేదల పక్షాన నిలిచి ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమవుతుందని, పార్టీ పిలుపు మేరకు ఉద్యమాలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ప్రజల పక్షాన నిలిచి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, జేసీఎస్ కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, మాజీ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, కాటా మాధవరావు, ముత్తంగి మహేష్, మన్నెం వెంకటేశ్వర్లు, దుద్దిగుంట మల్లిఖార్జునరెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


బహుమతులు ప్రదానం చేస్తున్న మహేంద్రరెడ్డి, శ్రీనివాసులు

కందుకూరు రూరల్: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తాయని నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి ఆకుల మహేంద్రరెడ్డి అన్నారు. నెహ్రూ యువకేంద్రం, శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహేంద్రరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మనోధైర్యం కలుగుతుందన్నారు. శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు మాట్లాడుతూ యువత ఆటలు ఆడడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి, ఆనందంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. వాలీబాల్, షాట్ పుట్, రన్నింగ్, ఖోఖో పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతలను అందజేశారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా వాసవీ సత్ర సముదాయాల మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు, కొణిజేటి విజయ్‌కుమార్, చీదెళ్ల కృష్ణ, టీఆర్ఆర్ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఓ.వెంకటేశ్వరరావు, పీడీ టి.సుబ్బారావు, కె.కరుణకుమార్, పి.శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, మంగతాయారు, రవీంద్ర, నరసింహం, వేణుగోపాల్‌రెడ్డి, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా

టంగుటూరు: కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో టి.నాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీలు సత్తా చాటినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఎన్‌వీ సుధారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ రావికంపాడులో జరిగిన రాష్ట్రస్థాయి బాక్సులంగడి క్రీడా పోటీల్లో తమ పాఠశాలలో చదువుతున్న ఎస్ ధనలక్ష్మి 52 కేజీల విభాగంలో, టి.దివ్య 48 కేజీల విభాగంలో ప్రథమ స్థానాలు సాధించారని ఆమె తెలిపారు. రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థినిలు త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

కొండపి: మండలంలోని ముప్పవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ ఆధ్వర్యంలో పదో తరగతి స్టడీ మెటీరియల్‌ను కొండపి మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు అందజేశారు. ముందుగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఆర్ శ్రీదేవి స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఉపాధ్యాయుల చేతుల విద్యార్థులకు మెటీరియల్ అందజేశారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు పి.శ్రీనివాసమూర్తి, ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కందుకూరు రూరల్: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో టీఆర్ఆర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అథ్లెటిక్స్‌లో కె.అశ్విని షాట్‌పుట్‌లో ప్రథమస్థానం, 100 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయస్థానం సాధించింది. డి.హరిత షాట్‌పుట్‌లో ద్వితీయస్థానం, టి.గోపినాథ్ షాట్‌పుట్‌లో తృతీయస్థానం సాధించినట్లు పీడీ కేఆర్. కరుణ కుమార్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్, అధ్యాపకులు అభినందించారు. జిల్లా స్థాయి పోటీల్లో కూడా మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

13 నుంచి వాలీబాల్ టోర్నమెంట్

పీసీపల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో ఈ నెల 13 నుంచి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనే వారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతి రూ.7 వేలు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 9618636844 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎట్టకేలకు స్తంభానికి వైర్లు బిగించారు..!

సాక్షి ఎఫెక్ట్..


నూతన స్తంభానికి విద్యుత్ వైర్లు బిగిస్తున్న సిబ్బంది

కొండపి: ' విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం..భయం గుప్పెట్లో ప్రజలు' అన్న శీర్షికతో సోమవారం సాక్షిలో కథనం ప్రచురితమైనది. నెల రోజుల క్రితం నూతన విద్యుత్ స్తంభాన్ని నిలబెట్టి శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని అలాగే ఉంచి విద్యుత్ కనెక్షన్లు ఉంచారు. ఆ వీధిలోని ప్రజలు ఆ విద్యుత్ స్తంభం ఎక్కడ కూలిపోతుందో, ఎటువంటి ప్రమాదాలు జరుగుతాయని భయాందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న స్తంభాన్ని పడవేసి, నూతన విద్యుత్ స్తంభానికి వైర్లు బిగించి కనెక్షన్ ఇచ్చారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1.27 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,27,622 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్. నరసింహబాబు సోమవారం తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.34,900, లడ్డుప్రసాదాల అమ్మకంద్వారా రూ.18,610, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.18,480, మహా ప్రాకార నిర్మాణానికి రూ.50,116, పంచామృత అభిషేకానికి విరాళంగా రూ.5,516 వచ్చినట్లు తెలిపారు. మహాప్రాకార నిర్మాణానికి జిల్లాలోని పొదిలి విశ్వనాథపురంకు చెందిన యడవల్లి రమేష్‌బాబు అజయలక్ష్మి దంపతులు, కుమార్తెలు వైష్ణవి, లిఖితలు రూ.50,116 విరాళంగా అందజేశారన్నారు.

భైరవకోనలో దద్దాల దంపతుల పూజలు


కుమారుడితో కేక్ కోయిస్తున్న దద్దాల దంపతులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం భైరవకోనలో కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్, మంజుభార్గవి దంపతుల కుమారుడు దద్దాల జ్ఞాన్ క్రిత్విక్ జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా త్రిముఖదుర్గాదేవి, భర్గులేశ్వర, కాలభైరవ, నగరేశ్వర ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం గోపూజ, అభిషేకం నిర్వహించగా అర్చకులు వారికి వేద ఆశీర్వచనంచేశారు. అనంతరం జ్ఞాన్‌క్రిత్విక్ జన్మదినం సందర్భంగా నియోజకవర్గంలో ఆరు మండలాల నాయకులు, కుటుంబ సభ్యుల నడుమ కేక్‌కోసి పంచిపెట్టారు. అనంతరం 500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ పులి శాంతిగోవర్ధన్‌రెడ్డి, పార్టీ మహిళా రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని సుజాతారెడ్డి, జెడ్పీటీసీలు గుంటక తిరుపతిరెడ్డి, కస్తూరిరెడ్డి, చప్పిడి సుబ్బయ్య, లక్ష్మీకాంతం ఓకే రెడ్డి, ఎంపీపీలు దంతులూరి ప్రకాశం, గాయం బలరామిరెడ్డి, రామన లక్ష్మీకాంతం, తిరుపతిరెడ్డి, అత్యాల జప్పన్న, కటికల వెంకటరత్నం, కే.రామిరెడ్డి, అంబటి కొండారెడ్డి, జి.బొర్రారెడ్డి, భువనగిరి వెంకటయ్య, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ చాంద్‌బాషా, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ టీయూసీ జిల్లా అధ్యక్షుడు మితికాల గురవయ్య, షేక్.బుజ్జి, చంద్రశేఖర్‌రెడ్డి, పి.సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

బండిరాములు మృతదేహానికి నివాళులు


రాములు మృతదేహానికి నివాళులర్పిస్తున్న సురేష్

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం పీరాపురం గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు బండి రాములు సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గ్రామానికి వెళ్లి రాములు కుటుంబసభ్యులను పరామర్శించి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాములు మృతి పార్టీకి తీరని లోటన్నారు. పార్టీ మండల కన్వీనర్ బత్తిన మదన మనోహర్, పిన్నిక శ్రీనివాసులు, మారంరెడ్డి గంగాధర్, యల్లావుల శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.